


**దు**ర్లభం త్రయమేవైత ద్దేవానుగ్రహ
హేతుకమ్
మనుష్యత్వం ముముక్షుత్వం మహా
పురుష సంశ్రయః

'మానవజన్మ, మోక్ష జిజ్ఞాస, పరమార్థ జ్ఞానులైన మహాపురుషుల సాంగత్యము అనే ఈ మూడున్నూ దైవానుగ్రహం లేనిదే లభ్యంకావు' అని ఆద్యశంకరులవారు సెలవిచ్చినట్టు-

నేనీ కార్యాలయంలో కొత్తగా నూనూగు మీసాలనూత్న యౌవనంలో ఉద్యోగిగా చేరేసరికి అప్పలస్వామిగారి మిత్రత్వం నాకు ప్రాప్తించింది.

పాపం! అప్పలస్వామిగారు సహృదయులు, అందరి శ్రేయోభిలాషులు అయినా, నాకుమాత్రం అధిక శ్రేయోభిలాషులు. వారికి నాపైగల ప్రత్యేక ఆదరాభిమానాలు ఇంకొకరిపై వుంటా

యని నేను భావించడంలేదు. భావించను కూడాను.

క్రొత్తగా కార్యాలయంలో అడుగు పెట్టి కుడ్యాల నలంకరించిన ప్రముఖ దేశనాయకుల చిత్రపటాలను తిలకిస్తూ, గుటకలువేస్తున్న తరుణంలో, తరుణ వయస్కులైన అప్పలస్వామిగారు భుజంమీద చెయ్యివేసి- "క్రొత్తగా గుమస్తాగా చేరబోయే పుణ్యాత్ములుకారావు నువ్వేనా నాయనా?" అని ఆప్యాయంగా అడిగేరు.

ఆయన పవిత్ర హస్తం నా గాత్రం మీద పడగానే కాయం పులకరించింది. ఆ నెమ్మది, ఆ మంచితనం. ఆ పుత్ర వాత్సల్యం చూస్తే ఎంతటివారికైనా గుండె నీరవుతుంది.

"అవున్నేనేనండీ! నమస్కారం!" అన్నాను.

"వెళ్ళు-తలగుమస్తాని కలుసుకో. నువ్వు చెయ్యవలసిన పనేమిటో చెప్తాడు" అన్నారు.

అప్పలస్వామిగారు చూస్తే నన్ను తలగుమస్తా దగ్గరకు వెళ్ళమన్నారు. ఇంతకీ ఈయ నెవరు? ఈయన నిర్వ హించే పదవి ఏమిటి?

సరే-ఏదో ఆప్యాయంగా మృదువుగా చెప్పేరు. ఆయనమాట త్రోసిరాజనడం ఎందుకని, వెళ్ళి తలగుమస్తాని కలిశాను. ఒక ఖాళీకుర్చీ చూపించి, నన్నందులో కూర్చోమన్నాడు తలగుమస్తా. కూర్చుని ఏవో పాతకాగితాలు తిరగేస్తూ, చదువుతూ, అందులోవున్న విషయాలను అవగాహన చేసుకోమన్నాడు.

నేనలాగే చేస్తున్నాను.

"మిమ్మల్ని అధికారిగారు రమ్మని కబురుపెట్టేరు, వెళ్ళండి" అని ఆదేశించాడు తలగుమస్తా.

నేను కార్యాలయంలో చేరి రెండు గంటలైంది కాని ఇంతవరకూ అధికారి గారిని చూడలేదు.

సరే బయలుదేరేను.

నా అదృష్టం ఏమోగాని అధికారి గారు దయార్ద్ర నవనీతహృదయులైన అప్పలస్వామిగారే!

తన క్రింది ఉద్యోగుల్ని తుచ్ఛంగా చూడక, సమదృష్టితోను, పుత్రవాత్సల్యంతోను చూసే అప్పలస్వామిగారివంటి అధికారులు ఎంతమంది ఉంటారు?

"నమస్కారమండీ!" అని చేతులెత్తి జోడించాను.


"వచ్చావా నాయనా! రా, కూర్చో" అని ఎదుటి కుర్చీని చూపించారు.

నా ప్రక్కన కూర్చున్న మరో యిద్దర్ని అవతలకి వెళ్ళమన్నట్లుగా సంజ్ఞ చేశారు. దీన్నిబట్టి చూస్తే, వారు నాతో ఏకాంతంగా ఏదో మాట్లాడ నిశ్చ యించుకున్నారని అనుకున్నాను.

"నీకు తల్లీ తండ్రీ ఉన్నారా నాయనా?" ప్రశ్నించారు.

"ఉన్నారండీ!"

## నిత్యజీవితంలో హస్తాభినయములు : “కపిత్థము”




“మీ నాన్నగారేం చేస్తున్నారు?”

“ప్రస్తుతం విజయనగరం సంస్థానంలో పనిచేస్తున్నారండీ!”

“అయితే నీకూ ఉన్న ఊళ్ళోనే ఉద్యోగంకనుక భోజనం గడిచిపోతుంది. నీకొచ్చే జీతం నీ స్వంతానికి వాడుకోవచ్చు నన్నమాట.”

“అంతా స్వంతానికే వాడుకుంటే ఎల్లాగండీ! ఇన్నాళ్లూ వాళ్ళు పెంచి పెద్దచేసినందుకు వారికేమైనా ఇవ్వాలి కదా? అందులోకీ మా నాన్నగారు త్వరలోనే రిటైరవుతున్నారాయె!” అన్నాను.

“అదే నీకు నేను చెప్పదలచాను. ఎవరైనా డబ్బు రుణం ఇమ్మంటే అలాగే చెప్పు!

—ఈ ఆఫీసులో ఏమాత్రం అవకాశంవున్నా, అప్పు తెమ్మంటూంటారు తోటి గుమస్తాలు. వాళ్ళు చేసే ఒత్తిడికి తట్టుకోవడం కష్టం.

—నీ మనసు కరగించి, నీకు జాలి కలిగేటట్లు చేయాలని గొప్పగా నటనలు చేస్తారు. ‘పిల్లాడికి జీతం కట్టాలి. ఇవాళ కట్టకపోతే బడిలో తీసేస్తారు. వాడి జీవితం పాడైపోతుంది—ఇల్లాలికి విపరీతంగా జబ్బుచేసింది. ఈ క్షణంలో మందు కొనకపోతే దాని ప్రాణాలు దక్కవు. రక్షించు’ అని వారి కుటుంబ బాధలు వర్ణిస్తూ, నీ సానుభూతి

సంపాదింప జూస్తారు. ఒకసారి ఇచ్చావా మరి నీ డబ్బు నువ్వు కళ్ళచూడవు! వారికేవిధంగాను లొంగకు—జాగర్త!" అని హెచ్చరించారు.

అప్పలస్వామిగారి హెచ్చరికను మననం చేసుకుంటూ పని చేసు కుంటున్నాను.

మా గుమస్తా సోదరులతో ఈ నెల రోజుల్లోనూ ముఖపరిచయమైనా సరిగ్గా అవలేదు. అప్పలస్వామిగారు చెప్పినట్టు అపుడే ఒక మిత్రశ్రీ దాపరించేడు.

"నమస్తే పుణ్యశ్లోకారావుగారూ!" అన్నాడతను.

నేను నోటిమాట లేకుండా ప్రతి నమస్కారం చేశాను.

"వర్కు బాగా పికప్ చేస్తు న్నారా?" అడిగేడు.

చేస్తున్నానన్నట్లు తలకాయ ఊపాను.

"కొంచెం తొందరగా అవసరం వచ్చింది. నా భార్యకు గర్భస్రావం కలిగి సుస్తీ చేసింది. ఓ పదిరూపాయ లిద్దురూ! రెండ్రోజుల్లో ఇచ్చేస్తాను" అన్నాడతను.

"నాకు అవకాశం లేదండీ! నేను జీతం అందుకోడం ప్రథమంకూడానా? ఇంట్లో మా నాన్నగారికి లెక్క చెప్పాలి" అన్నాను.

ఇటువంటి సమాధానాలు నిర్మొహ మాటంగా నలుగురైదుగురికి చెప్పేను. ఈ సందర్భంలో అప్పలస్వామిగారికి నేనెంతో ధన్యవాదాలర్పించాను. ఆ మహాభాగుడే కాని ఈ గుమస్తా సోద రుల సంగతి ముందుగా తెలియపరచక పోతే, నేను అప్పివ్వడమూ వాళ్ళు ఎగ వెయ్యడమూ తప్పదుకదా!

నేనో చచ్చుదద్దమ్మని! ఎదుటివాడు చెప్పింది అబద్ధమో సుబద్ధమో తెలుసు కునేటంత చతురత నాకు లేదు. వాళ్ళడి గిందేదో ఇచ్చివేస్తినా—నా గతేంకాను? ఆ అప్పలస్వామిగారి చల్లని చూపువల్లనే ఏదో ఇలా ఈడ్చుకొస్తున్నాను.

రెండోసారికూడా జీతం అందు కున్నాను. కొంతడబ్బుతో కొత్తబట్టలు కుట్టించుకోవాలని సంకల్పం.

ఇంతలో అధికారిగారైన అప్పల స్వామిగారు రమ్మన్నారని కబురు. తక్షణమే బయల్దేరాను. ఈ పర్యాయం నా మేలుకోరి ఏమని హెచ్చరించ నున్నారో ఏమో? ఆయన హెచ్చరికను పాటించకపోతే నా డబ్బు ఏంకాను?

"రావోయ్ పుణ్యశ్లోకారావు! కూర్చో" అని కుర్చీ చూపించారు. కూర్చున్నాను.

"నాకు ఈ నెల ఎకౌంటెంటు జనరల్ దగ్గర్నుంచీ పేస్లిప్ రాలేదోయ్! అంచేత నా జీతం డ్రాచేసుకోలేక పోయాను. నీ జీతంలో ఓ వంద రూపాయ లియ్యవోయ్. మళ్ళీ రెండ్రో జుల్లో ఇచ్చేస్తాను," అన్నారు.

ఎంతటివారికైనా కష్టాలొస్తాయి. ఇంత పెద్ద అధికారి ఎంతో కష్టంలో




ఉండకపోతే అడగడుకదా అని వెంటనే ఇచ్చేశాను.

ఒకటి కాదు, రెండు కాదు—ఆర్నెల్లు గడిచాయి కాని, అప్పలస్వామిగారు నా కివ్వవలసింది ఇవ్వలేదు. ఇవ్వమని అడిగే సాహసం నాకు లేదు. అడిగితే, ఆయనకి కోపం వచ్చి నన్ను ఉద్యోగం లోంచి ఊడబెరికితే?

ఆఖరికి నా వందరూపాయలూ నాకు దక్కలేదు.

కష్టార్జితం ఎప్పుడూ పోదని మహానుభావులంటూంటారు. అది నిజమని నాకు తోచదు. నేను కోల్పోయిన వంద రూపాయలూ కష్టార్జితమే కాని అక్రమార్జితం కాదే?

శిఖ్కు మతాచార్యుడు నానక్ కష్టార్జితం పోదని, పోయినా దొరికి తీరుతుందని ఉపన్యసిస్తున్నాడు. ఒక శ్రోత లేచి— "ఇదిగో! నా వేలిఉంగరం నా కష్టార్జితమే. ఇది ఎదురుగా కనిపిస్తున్న చెరువులో పారేస్తాను. మీరు చెప్పింది నిజమో కాదో పరిశీలిస్తాను!" అన్నాడు.

అలాగే చూడమన్నాడు నానక్.

శ్రోత ఉంగరాన్ని సరస్సులో పారవేశాడు. అది, ఒక చేపమింగడం, ఆ చేప జాలరి వలలో చిక్కడం, అతను చేపను కోయగా ఉంగరం దొరకడం, అది మళ్ళీ భద్రంగా యజమానికి అందివ్వడం జరిగిందిట!

ఈ దృశ్యం నా తలంపుకు వచ్చి కళ్ళకు కట్టినట్లు అనిపించింది.

కాని నా డబ్బు నాకు దక్కలేదు! ఇప్పుడు నేను రిటైరయి పింఛను దారుణ్ణయానుకూడా! కష్టార్జితం పోదా?